www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 06 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 08



# పంతుళ్లతోనే మా ఉన్నతి

### గురువులే భావితరాల రూపశిల్పులు

### కరీంనగర్ ను విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుదాం

### కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, అక్షిత బ్యూరో :** గురువులే భావితరాల రూపశిల్పులని మన అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానవంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైందని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. దీనికి కలెక్టర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, డీఈవో చైతన్య జైనీ, విద్యాశాఖ ఏడి ప్రశాంత్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. దీనికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు పాఠశాల రెండో ఇల్లు అని.. బాల్యం నుంచే పాఠ్యాంశాలతో పాటు శుభ్రత, ధైర్యం, క్రమశిక్షణ నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మేము ఇలాంటి స్థితిలో ఉన్నామంటే మాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులే కారణమని.. నా ఉన్నతికి కారణమైన ఉపాధ్యాయులను నిత్యం గుర్తు చేసుకుంటూ ఉంటానని పేర్కొన్నారు. అన్ని వృత్తుల వారిని తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తి అని. ఇలాంటి వృత్తిలో ప్రతి నిమిషం బాధ్యతగా పనిచేస్తూ ..మిగతా 2లో



# మహిళల ఆర్థిక పరిపుష్టికి కృషి

### రూ.175 కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కుల పంపిణి

### మహిళా సంఘాలకు ఉపాధి, వ్యాపార అవకాశాలు

### మంత్రి సీతక్క

### కొల్లాపూర్ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తా

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్ కర్నూల్ / కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ సొంత కాళ్లపై నిలబడేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ ..మిగతా 2లో



# 30 ఏళ్ల క్రితమే నిర్మించా రూ.18 కోట్లతో విస్తరణ

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా 1995లో పనిచేసిన సమయంలోనే రూ.80 లక్షలతో బైపాస్ రహదారిని నిర్మించానని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఆ రహదారి నిర్మాణంతో పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెంది కొత్త కాలనీలు ఏర్పడ్డాయని, సుమారు 30 ఏళ్లపాటు ప్రజలకు ఉపయోగపడిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రూ.18 కోట్లు మంజూరు చేయించి బైపాస్ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. చెట్లు ..మిగతా 2లో

# గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం





### 460 మొక్కలు స్వాధీనం

### నలుగురు అరెస్ట్

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** సిర్పూర్ (యు) మండలంలో గుట్టుచప్పుడు కాకుండా సాగు చేస్తున్న అక్రమ గంజాయి తోటలపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ప్రత్యేక తనిఖీలలో మొత్తం 460 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, మూడు వేర్వేరు కేసుల్లో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

**పోలీసుల దాడుల వివరాలు**

బుర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు ..మిగతా 2లో

## 30 ఏళ్ల క్రితమే నిర్మించా రూ.18 కోట్లతో విస్తరణ



**మొదటి పేజీ తరువాయి...**

విద్యుత్ సరఫరా, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపడుతున్నందున కొంత జాప్యం జరుగుతోందన్నారు. రహదారి నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాను సంగారెడ్డి వాడినందున పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని, ప్రతికూల విమర్శలు మానుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు. సదాశివపేటలో కందకం రహదారి నిర్మాణంతో పాటు సిద్ధాపూర్‌లో సుమారు 5 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించానని, అయితే అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ స్థలాల లబ్ధిదారులను అక్కడి నుంచి వెళ్లగొట్టిందని జగ్గారెడ్డి ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలవకపోయినా సంగారెడ్డి అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు.

## గంజాయి సాగుపై పోలీసుల ఉక్కుపాదం



**మొదటి పేజీ తరువాయి...**

పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసు బృందాలు జీర్లఘాట్, గుట్టగూడ గ్రామ శివారులలోని వ్యవసాయ భూముల్లో ముమ్మర సోదాలు చేపట్టాయి. పంట చేల మధ్య రహస్యంగా పెంచుతున్న గంజాయి మొక్కలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**

గెడం లోబాజీ (జీర్లఘాట్, బుర్నూర్ పంచాయతీ)

గెడం జయవంత్ (జీర్లఘాట్, బుర్నూర్ పంచాయతీ)

కుమ్రా మాధవరావు (జీర్లఘాట్, బుర్నూర్ పంచాయతీ)

పెందోర్ సూర్యభాను (గుట్టగూడ నివాసి)

నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు.

**ఉపేక్షించేది లేదు**

**ఎస్పీ నితికా పంత్ హెచ్చరిక**

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని జిల్లా ఎస్పీ నితికా పంత్ స్పష్టం చేశారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి సాగు లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని, జిల్లాను 'గంజాయి రహిత జిల్లా'గా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

# మహిళల ఆర్థిక పరిపుష్టికి కృషి

**మొదటి పేజీ తరువాయి...**

కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క తెలిపారు. మహిళా సంఘాలను కేవలం పొదుపు, రుణ కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, వివిధ రంగాల్లో వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్ద కొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ లతో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క రోడ్డు, సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు పనులను శంకుస్థాపన చేశారు.

అనంతరం కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని రాజా గారి బంగ్లా ఆవరణలో 1000 రోజు ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ.....

మహిళలకు నిరంతరం పని కల్పించేలా ప్రభుత్వ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల యూనిఫాంలు, పాఠశాల విద్యార్థుల యూనిఫాంలు తదితర పనులను మహిళా సంఘాల సభ్యులకు అప్పగిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నామని,ఈ విధంగా మహిళా సంఘాల సభ్యులకు స్థిరమైన ఆదాయ మార్గాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కార్యక్రమం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రూ. 2.53 కోట్ల మేర కమిషన్ ఆదాయం మహిళా సంఘాలకు లభించిందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా సంఘాలను భాగస్వాములను చేయడం ద్వారా వారికి ఉపాధితో పాటు ఆదాయ అవకాశాలను కూడా



కల్పిస్తున్నామని చెప్పారు.

ప్రతి మహిళ ఏదో ఒక వ్యాపారం లేదా స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగస్వామి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళలు ఇంటి పరిధికే పరిమితం కాకుండా బయటకు వచ్చి ఆర్థిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొని తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు.

మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును స్వయంగా వినియోగించుకోవడంతో పాటు మిగులు విద్యుత్తును విక్రయించడం ద్వారా మహిళా సంఘాలకు నెలకు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

మహిళా సంఘాల సమావేశాలు, కార్యకలాపాల నిర్వహణకు గతంలో సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదురయ్యేవని మంత్రి గుర్తుచేశారు. ప్రస్తుతం మహిళా సంఘాలకు ప్రత్యేకంగా ఇందిర మహిళా శక్తి భవనాలు నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు.

మహిళా సంఘాలు తమ సమావేశాలను, కార్యక్రమాలను సొంత భవనాల్లో నిర్వహించుకునేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో ఇందిర మహిళా శక్తి భవనం, జిల్లా కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు.

మహిళలు ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు రవాణా సౌకర్యం కూడా కీలకమని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేసినట్లు గుర్తుచేశారు.

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులు, మహిళలు, పేదలు, విద్యార్థులు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షను గౌరవిస్తూ సోనియా గాంధీ నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందని మంత్రి గుర్తుచేశారు.

అనంతరం కొల్లాపూర్ నియోజక వర్గంలో మహిళా సంఘాలకు 175 కోట్లు రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గం పరిధిలోని మండలాల మహిళా సంఘాల ఆధ్వర్యంలోని సంఘాల కు గొర్రె పిల్లను, నాటుకోడి పిల్లలను పంపిణీ చేశారు. అంతకు ముందు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆడంబరాలకు పోయి అప్పుల పాలు కావద్దు అనే అంశంపై నాటికను ప్రదర్శించిన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్,అదనపు కలెక్టర్ దేవ సహాయం, ఆర్డీవో బన్సీలాల్, కొల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పంతుళ్లతోనే మా ఉన్నతి

**మొదటి పేజీ తరువాయి...**

రాష్ట్రంలోనే జిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పెంపొందించేందుకు ఫౌండేషనల్ లిట్రసి అండ్ న్యూమరసీ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులకు విద్య అందించాలని పేర్కొన్నారు.

అన్ని పాఠశాలల ప్రగతిపై మండలాల వారిగా డీటెయిల్ రివ్యూ నిర్వహించాలని పేర్కొన్నారు.

మరిన్ని సిఎస్ఆర్ నిధులు తెచ్చి పాఠశాలలను మెరుగుపరుస్తామన్నారు.ఎలాంటి సమస్యలు ఉన్నా ఉపాధ్యాయులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. భయంతో కాకుండా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విద్యారంగ అభివృద్ధికి పాటుపడుతున్నారని వారి తోడ్పాటును అభినందించారు.



"మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ" సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు.

వ్యక్తి ఉన్నత స్థానంలో నిలిచేందుకు ఉపాధ్యాయుల పాత్ర కీలకమని విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి తీసేలా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

"మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ" నగరపాలిక పరిధిలోని పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

సైన్స్ మ్యూజియంను ఆధునీకరించామని త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

డీఈవో "చైతన్య జై ని" మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామని భాగస్వాములు అవుతున్న ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. కలెక్టర్ మార్గదర్శకత్వం మరింత స్ఫూర్తిని ఇస్తుందని వివరించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ "సత్తు మల్లేశం" మాట్లాడుతూ పుస్తక పఠనం కోసం విద్యార్థులకు సహకారం అందిస్తూ వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యారంగంలో విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందించి సన్మానించారు.

కార్యక్రమంలో పరీక్షల విభాగం సెక్రటరీ భగవంతయ్య, స్పెషల్ అధికారులు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, దాసి శ్రీనివాస్, మహేందర్, జీ సీడీఓ ఉమారాణి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, ఎంఈఓ లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# కేసీఆర్‌ను తిట్టకపోతే ఏం చేస్తాం?

**వెయ్యి రోజులుగా ఫామ్ హౌస్‌లో పడుకుంటే తిట్టరా..!?**

**రాష్ట్ర అభివృద్ధికి అడ్డం పడుతూ విమర్శలు**

**కాంగ్రెస్ అభివృద్ధి చూసి రోడ్లపై పడ్డ బిఆర్ఎస్ నాయకులు**

**షాద్‌నగర్ కాంగ్రెస్ పట్టణ నాయకుల సమావేశం**

**ఫామ్ హౌస్ లోనే కెసిఆర్ బంది**



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌ను తిట్టకపోతే ఏం చేస్తామని, ప్రజలకు అందుబాటులో లేకుండా వెయ్యి రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమైన కేసీఆర్‌ను ప్రశ్నించే దమ్ము సొంత పార్టీ నాయకులకు ఉందా? అని నిలదీశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుంటే బీఆర్ఎస్ కార్యకర్తలు మాత్రం రోడ్లపై పడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నేత అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, మురళీమోహన్, అప్పి, కళ్యాణ్‌కార్ దిలీప్, పెంటయ్య, సీనియర్ నాయకులు ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, గంగ తదితరులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ తీరు చూస్తుంటే కుటుంబ సభ్యులు అతన్ని ఫామ్ హౌస్ లోనే బంధించినట్టు ప్రజలు అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై తీవ్ర విమర్శలు చేస్తూ, వారి పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తమ బతుకుల గురించి కాంగ్రెస్ నాయకులు చెప్పడం కంటే, కవిత నోటి నుంచి వింటేనే ప్రజలకు మరింత స్పష్టంగా అర్థమవుతుందని వ్యాఖ్యానించారు.

దక్షిణ తెలంగాణను ఎండబెట్టి తన ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసుకునేందుకు ప్రజాధనాన్ని కొల్లగొట్టి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గత పది సంవత్సరాల కాలంలో విద్యా రంగాన్ని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర అంశాల్లో నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ నాయకులు బెంబేలెత్తిపోతున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నియోజకవర్గానికి కీలకమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వపరంగా అన్ని అనుమతులు సాధించడంతో పాటు నోటిఫికేషన్ కూడా విడుదల చేయించారని తెలిపారు. దీంతో దిక్కుతోచని పరిస్థితిలో ప్రతిపక్ష నాయకులు రోడ్లపై పడి గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు.

కేసీఆర్‌ను రాజకీయంగా బతికించుకునేందుకే నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు తాపత్రయపడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరన్నారు. షాద్‌నగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని తెలిపారు.

అన్నదాతల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు. రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నామని, రాష్ట్రాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు..

# ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

**నాయిని నీలిమ రెడ్డి**







**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి శనివారం 51వ డివిజన్ పరిధిలోని 'స్పందన' మానసిక దివ్యాంగులు, బధిరుల కేంద్రంలో స్థానిక చిన్నారులతో కలిసి ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని అధ్యాపకులను ప్రత్యేకంగా సన్మానించి, ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో కలిసి వేడుకల్లో పాల్గొని వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.

ఈ సందర్భంగా నాయిని నీలిమ రెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. విద్యతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం, స్వావలంబన పెంపొందించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఈసీ మెంబర్ అనితా రెడ్డి, 51వ డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ కరీం, నాయకులు లక్ష్మారెడ్డి, రవీందర్ రెడ్డి, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

**త్రిపురారం అక్షిత న్యూస్:** త్రిపురారం మండల కేంద్రంలోని దుబ్బ కాలనీ నందు ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాయకులు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ,విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు ,క్రమశిక్షణను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని.విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదన్నారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి చేసిన సేవలు కొనియాడారు.వారి ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తూ ఉపాధ్యాయుల సేవలను సమాజం ఎల్లప్పుడూ గుర్తించి గౌరవించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను నాయకులు శాలువాలతో సత్కరించారు.

## కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి బాధ్యతల స్వీకరణ



**వరంగల్, అక్షిత బ్యూరో:** కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి శనివారం కుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, కుడా అధికారి అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానాన్ని పంచే శిల్పి ఉపాధ్యాయుడు

**ట్రినిటీ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**చైర్మన్ కెవిబి కృష్ణారావు, ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఉజ్జిని మంజుల**



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్లో శనివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదిన సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఉజ్జని మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ.. సాధారణ ఉపాధ్యాయ స్థాయి నుండి భారతదేశం మొదటి పౌరుడు రాష్ట్రపతి వరకు అంచలంచలుగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు.విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధన చేశారు. విద్యార్థులు కలెక్టర్, డీఈఓ,ఎంఈఓ,పాఠశాల చైర్మన్,ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులుగా వ్యవహరించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకొని స్కూల్ చైర్మన్ కెవిబి కృష్ణారావు, ప్రధానోపాధ్యాయురాలు ఉజ్జిని మంజుల పాఠశాలలోని ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి వారికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని పంచే శిల్పి అని,విద్యతోనే ప్రతి ఒక్కరూ రాణించటం జరుగుతుందని... విద్య నేర్పిన గురువును, జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పటికీ మరవకూడదని పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ ఎం శివరాణి, శివాని,నీరజ, మంజుల,స్వప్న,కొండమ్మ, జ్యోతి సబిత,స్వప్న,అనూష తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం

### ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవన్నారు. విద్యార్థులకు కేవలం



పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, విలువలు, బాధ్యతాయుతమైన పౌరులు గా ఎదగడానికి అవసర మార్గనిర్దేశం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రత్యేకంగా బాలికల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బాధ్యత మరింత గొప్పదన్నారు.

ఎందుకంటే ఒక బాలిక చదువుకుంటే ఒక కుటుంబం ఎదుగుతుందన్నారు. ఒక బాలిక ఉన్నతంగా ఎదిగితే ఒక తరం మారుతుందన్నారు.

విద్యావంతురాలైన ఒక మహిళ సమాజాన్ని మార్చగలదన్నారు.

అందుకే ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి బాలికలో నేను ఒక భవిష్యత్తు డాక్టర్, ఇంజనీర్, ఉపాధ్యాయులు, శాస్త్రవేత్తను, పోలీస్ అధికారి, ఐఏఎస్ అధికారిని, ప్రజాప్రతినిధిని చూడాలనుకుంటున్నానన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు బండ్ల ఏడుకొండలును అభినందించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**నడిగూడెం,అక్షిత న్యూస్:** గురుపూజోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల లో భాగంగా రామాపురం హరిజనవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కు చెందిన బండ్ల ఏడుకొండలు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారం స్వీకరించారు మొదటినుంచి తను పనిచేసే ప్రతి పాఠశాలలో మంచినీటి సౌకర్యార్థం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తూ ప్రతి విద్యార్థికి దాతల ద్వారా నోట్ బుక్స్ ను అందిస్తూ అలాగే తను బోధించుచున్న పాఠశాలలోనే తన చిన్న కూతురు రోహిత ని 5వ తరగతి లో జాయిన్ చేసి, రెండో కూతురుని బహుగంధ కూడా ప్రభుత్వ పాఠశాలలోనే జడ్పీహెచ్ఎస్ బరాఖత్ గూడెం ( మునగాల మండలం) చదివిస్తూ ఎంతోమంది ఉపాధ్యాయులకు గ్రామస్తులకు ఆదర్శంగా నిలిచారు.. అలాగే ప్రతిరోజు పాఠశాలలో నిత్యం 90 శాతం హాజరను నమోదు చేస్తు, ఎఫ్ ఎల్ ఎన్ లాంటి కార్యక్రమాలు చురుకుగా పాఠశాలలో అమలు చేస్తూ సక్రమంగా బడికి రాని విద్యార్థుల పట్ల నిరంతరం వారి తల్లిదండ్రులను సంప్రదించి బడికి వచ్చేలా చేస్తూ, ఏ ఐ ద్వారా పాఠ్యాంశాలను రూపొందించి నూతన పద్ధతులను పాఠశాలలు జాలి ఆక్టివిటీస్ ద్వారా పిల్లలు సృజనాత్మకతను జోడిస్తూ పాఠాలను బోధిస్తున్నారు. ఇలాంటి సేవను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ చేతుల మీదుగా అందించడం జరిగింది. ఏడుకొండల ను జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్,మండల విద్యాధికారి వనం సత్యనారాయణ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపయ్య అభినందించారు.

## మహిళా శక్తి సంఘాల ఆధ్వర్యంలో సోలార్ యూనిట్లకు భూమిపూజ

### మంత్రులు డాక్టర్ దనసరి సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ, కలెక్టర్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ మండల పరిధిలోని అంకిరావుపల్లి, సింగోటం గ్రామాల పరిధిలో ఇందిరా మహిళా శక్తి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న రెండు,800 కిలోవాట్ల (11 కేవీ) సోలార్ యూనిట్ల నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ లతో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ సోలార్ యూనిట్ల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థికంగా మరింత బలోపేతం కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి మరియు ఆదాయ మార్గాలను పెంపొందించేలా ,గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక సాధికారతకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని మంత్రులు తెలిపారు.

అంతకుముందు అంకిరావుపల్లి గ్రామంలో రూ.17.78 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న హ్యామ్ రోడ్ల నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు, ఎంపీ, జిల్లా కలెక్టర్ శంకుస్థాపన చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఉపాధ్యాయులు జీవితానికి దిశానిర్దేశం చేస్తారు

### టీచర్స్ డె సందర్భంగా దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన

### ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, వారి లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేసి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం రోజున ఎల్లారెడ్డిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దూమల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ సందర్శించి, విద్యార్థుల విద్యాభ్యాసం , వారుసాధించాలనుకుంటున్న లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి అడిగి తెలుసుకున్నారు. మనకు జన్మనిచ్చేదితల్లిదండ్రులైతే.. మన జీవితానికి జ్ఞానాన్ని, మార్గదర్శకత్వాన్నిఅందించేదిఉపాధ్యాయులని తెలిపారు.ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పాత్రఎంతోకీలకమని,విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తూ, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయులపాత్రఅమూల్యమైనదని జిల్లా ఎస్పీ అన్నారు.

నేను ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా ఈ స్థాయిలో ఉన్నానంటే, నాకు విద్యాబుద్ధులు నేర్పి, మంచి మార్గాన్నిచూపించిన నా గురువుల పాత్ర ఎంతో ఉందని ఎస్పీ తన గురువులనుఈసందర్భంగా ఆత్మీయంగా గుర్తు చేసుకున్నారు.

గురువులు విద్యార్థులకు మార్గం చూపించే దిక్సూచి వంటివారాని,విద్యార్థులు గురువులు చూపిన మార్గంలో క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరన్నారు.

కష్టపడితే ఏదైనా సాధించవచ్చని అందరూ తమ లక్ష్యాలను చేరుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు.విద్యార్థి దశలో సోషల్ మీడియా, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎస్పీ గారి వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ లు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవి

### ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి

### జంగోని గూడలో మైసమ్మ, పోచమ్మ,ఎల్లమ్మ,బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

### ఆలయ అభివృద్ధికి రూ. 51,000/- విరాళం అందజేత



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవని ఎమ్మెల్సీ నాగర్కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండలంలోని జంగోని గూడలో మైసమ్మ,పోచమ్మ,ఎల్లమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులకు రూ.51 వేలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు.మైసమ్మ, పోచమ్మ,ఎల్లమ్మ,బొడ్రాయి తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గ్రామాల్లో ఘనంగా నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు.అమ్మవార్ల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అంతిరెడ్డిగూడ సర్పంచ్ మంజుల యాదగిరి,వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు,మాజీ సర్పంచులు వంకాయల రామ్ రెడ్డి,సుధాకర్ గౌడ్,జెకే నరసింహ,ఉపసర్పంచ్ మల్లేష్, నాయకులు జంగ నరసింహ,జిల్లెల జనార్దన్ రెడ్డి, జిల్లెల బాల్ రెడ్డి,జంగిలి కుమార్,శ్రీకాంత్ గౌడ్,సుదర్శన్ గౌడ్,కర్ణప్ప,తుమ్మల నర్సిమలు,శివ చారి,చందు,సంగయ్య గౌడ్,తుప్పుడు క్రిష్ణ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# పదేళ్లు దోచి మళ్లీ
# రోడ్డెక్కుతున్న కబ్జాకోరులు

**బురద రాజకీయాలు చేస్తే తస్మాత్ జాగ్రత్త... తోలుతీస్తా**

**మీలాగా ఎంగిలి మెతుకులకు ఆశపడేవాళ్లం కాదు**

**దమ్ముంటే అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రండి**

**బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి హెచ్చరిక**

**అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం**

**నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** ప్రభుత్వ భూములు, పేదల స్థలాలు... వేటిని వదలకుండా పదేళ్లపాటు దోచుకుతిన్న కబ్జాకోరులు మళ్లీ ఏం ముఖం పెట్టుకుని రోడ్డుక్కుతున్నారని ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు. పేదోడి నోటికాడ ముద్దలాక్కుని తినేవాడికి పేదప్రజల కష్టాలేం తెలుస్తాయన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను ఆయన అందజేశారు.

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న వారు పేదప్రజలకు రేషన్‌కార్డులు, ఇళ్లు, సన్నబియ్యం, ఉచిత కరెంటులాంటి పథకాలను ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజలు మెచ్చి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వమే పేదల గురించి ఆలోచిస్తుందన్న ఆయన... ఎంగిలి మెతుకులకు ఆశపడే వారు తమ పార్టీలో ఉండరని చెప్పారు. పదేళ్ల వారి పాలనలో రెండున్నరేళ్ల తమ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై దమ్ముంటే చర్చకు రావాలని, తమ కార్యకర్తలే సమాధానం చెబుతారన్నారు.

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మరల్చేలా బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని, అలాంటి వారిపై తాను దృష్టి సారిస్తే



రోడ్డుపై కూడా తిరగరని చెప్పారు. బట్టకాల్చి మీదేసే ప్రయత్నం చేస్తే, తోలు తీస్తానని మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించే బాధ్యత తనదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఇంటిస్థలం లేని వారికి కూడా గృహసౌకర్యం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రేషన్‌దుకాణాలే పేద ప్రజల సంక్షేమ పథకాలకు కేంద్రాలన్న మల్‌రెడ్డి అవసరమైన చోట మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి, బాటసింగారం రైతు సహకార బ్యాంకు ఛైర్మన్ జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ భాస్కరాచారి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జక్క రవీందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ విజయాశ్రీశైలం, కవాడిపల్లి సర్పంచ్ లక్ష్మీప్రసన్నరవీందర్‌రెడ్డి, జాఫర్‌గూడ సర్పంచ్ వెంకటేశ్‌గూడ, లష్కర్‌గూడ సర్పంచ్ ఐలయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ దాసుగౌడ్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్
# వెంటనే విడుదల చేయాలి

**పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10 వేలు ఎక్కడ..?**

**స్కూటీలు ఎక్కడ..? తులం బంగారం ఎక్కడ..?**

**రాష్ట్రంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నువ్వేనా..?**

**బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి**




**రంగా రెడ్డి అక్షిత బ్యూరో:** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులతో కలిసి ఇబ్రహీంపట్నం సాగర్ హైవేపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తామని, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీలు ఇచ్చారని, కానీ వాటి అమలు ఏమైందని ప్రశ్నించారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదు**

ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి" అని డిమాండ్ చేశారు.

అలాగే ఎన్నికల సమయంలో మహిళలకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి బాధ్యతలు ఎవరు నిర్వహిస్తున్నారు..?విద్యార్థుల సమస్యలను పట్టించుకునే వారే లేరా..?" అంటూ ప్రభుత్వంపై ప్రశాంత్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నిరసన ర్యాలీలో బీఆర్ఎస్వీ నాయకులు రాజ్ కుమార్, శివ సాయి, జెర్కొని రాజు, నిట్టు జగదీష్,మున్సిపల్ ఛైర్మన్ సుదర్శన్ రెడ్డి,నాయకులు, బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెంచు కుటుంబాల పునరావాసానికి రూ.4.50 కోట్లతో అభివృద్ధి పనులు

**బాచారంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణానికి మంత్రులు దినసరి సీతక్క, జూపల్లి కృష్ణారావు,ఎంపీ, కలెక్టర్ శంకుస్థాపన**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన 257 చెంచు కుటుంబాల పునరావాసం కోసం కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలంలోని బాచారం గ్రామంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బాచారం గ్రామంలో రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పునరావాస కాలనీ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు దినసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న చెంచు కుటుంబాలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పునరావాస కాలనీలో సురక్షితమైన, గౌరవప్రదమైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. కాలనీలో అవసరమైన రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఎఫ్‌డీఓ చంద్రప్రకాశ్ సింగల్ చర్లపల్లి పాచారం, అదనపు కలెక్టర్ దేవసహాయం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన చెంచు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కదం తొక్కిన జెన్‌జీ.. స్తంభించిన తాండూరు ఇందిరాచౌక్

**వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్వీ సమరభేరి**





**తాండూరు అక్షిత ప్రతినిధి:** తాండూరు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను ప్రశ్నిస్తూ, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆందోళనకు యువత భారీగా తరలి రావడంతో తాండూరు ఇందిరాచౌక్ జనసంద్రంగా మారింది. ప్రభుత్వ వైఫల్యాలు, ఎన్నికల హామీల అమలు, యువత సమస్యలను ప్రస్తావిస్తూ, నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగుతుందని,అన్నారు. విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, డిమాండ్ చేశారు. యువతను అణచి వేయాలని, చూస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పీఠాన్ని కదిలించడం పెద్ద లెక్క కాదని వ్యాఖ్యానించారు.

ఆందోళనలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని పైలట్ రోహిత్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేయడం, ఆయనతో సెల్ఫీలకు పోటీ పడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## సుద్ధకల్ గ్రామంలో అంగన్వాడి సెంటర్లో ఉపాధ్యాయ దినోత్సవం

**సూపర్వైజర్ వనజ రెడ్డి**



**కల్వకుర్తి ,అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండల పరిధిలో సుద్ధకల్ గ్రామంలో అంగన్వాడి సెంటర్లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు,కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ వనజ రెడ్డి పాల్గొని గర్భిణీలకు బాలింతలకు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ టీచర్ కు శాలువాతో సత్కరించారు. ప్రతి ఒక్కరు కూడా విద్యార్థులను అంగన్వాడి సెంటర్ కు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ టీచర్ స్వప్న . గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజే ఏ)జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ ఖాసీం



**ఖమ్మం/అక్షిత బ్యూరో :** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా షేక్ సయ్యద్ ఖాసీం( అక్షిత దిన పత్రిక బ్యూరో చీఫ్ ) నియమితులయ్యారు. టీజేఏ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా టీజేఏ జిల్లా అధ్యక్షులు జి నాగ స్వామి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాసీం మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) యూనియన్ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు నాగ స్వామికి టీజేఏ రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

## అక్షిత రిపోర్టర్ సైఫోద్దీన్‌కు ఘన సన్మానం



**కౌడిపల్లి అక్షిత న్యూస్:** జానపద సాంస్కృతిక కళాకారుల సంబరాల్లో భాగంగా నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అక్షిత రిపోర్టర్ సైఫోద్దీన్‌ను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జానపద సాంస్కృతిక కళాకారుల సలహాదారు దరువు అంజన్న ముఖ్య అతిథులుగా హాజరై సైఫోద్దీన్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.

జానపద కళలు, కళాకారులను ప్రోత్సహించడంతో పాటు వారి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు. కళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు చేస్తున్న కృషిని అభినందించారు.

కార్యక్రమంలో జానపద సాంస్కృతిక కళాకారులు, నిర్వాహకులు, పాత్రికేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్ రెడ్డి ఓటుకు నోటు దొంగ అంటూ వ్యాఖ్యానించారు.యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్ రెడ్డి.. ఓటుకు నోటు దొంగ అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల మోసాలపై పట్టణం లోని స్థానిక అంబెద్కర్ స్టేడియం లో బీఆర్ఎస్ చేపట్టిన యువభేరి సభకు కేటీఆర్ హాజరై ప్రసంగించారు. లక్కీ లాటరీ తగిలి రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ప్రధాని మోదీని గడగడలాడించిన యువతకు రేవంత్ ఓ లెక్క కాదన్నారు. తెలంగాణ యూత్ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ నాయకులు పెద్ద పెద్ద మాటలు చెప్పారని.. ఇప్పుడేమైందని ప్రశ్నించారు. జాబులు లేవని నోటిఫికేషన్‌లు లేవన్నారు. లూటిఫికేషన్‌లు మాత్రం బ్రహ్మాండంగా నడుస్తున్నాయని మండిపడ్డారు. వందరోజుల హామీలు నెరవేర్చక వెయ్యిరోజులు అవుతోందని అన్నారు.కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. 'రాజీనామా ఎవరు చేయాలి?.. తెలంగాణ తీసుకొచ్చిన కేసీఆర్



రాజీనామా చేయాలా? ప్రజలను మోసం చేసిన రేవంత్ రాజీనామా చేయాలా' అని ప్రశ్నించారు. 420 మోసాలకు 420 సార్లు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌తో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు ముందున్నాయన్నారు. కమీషన్ల కోసం మంత్రులు కొట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చారని మండిపడ్డారు. రాహుల్ ఎందుకు హైదరాబాద్‌కు రావడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగాలపై ఒక్కొక్కరూ ఒక్కో మాట చెబుతున్నారన్నారు. 1000 రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చింది 16 వేల ఉద్యోగాలే అని తెలిపారు. పదేళ్లలో తాము 2.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని.. ఉద్యోగాల కల్పనపై చర్చకు కాంగ్రెస్ సిద్ధమా అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు.ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటిఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.తనను ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# ఎంవీఎస్ కళాశాలను తెలంగాణలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

**70 కోట్లతో సమగ్ర ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక**

**తొలి విడతగా 20 కోట్లతో నేడు శంకుస్థాపన**

**ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అన్ని హంగులతో కూడిన అత్యుత్తమ విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించి, మాట్లాడుతూ వేలాది మంది శాస్త్రవేత్తలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులను అందించిన ఘనత ఎంవీఎస్ కళాశాలకు ఉందన్నారు. 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ కళాశాలను సుమారు 70 కోట్లతో సమగ్ర ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని, అందులో భాగంగా తొలి విడతగా 20.50 కోట్లతో నేడు శంకుస్థాపన, భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 50 కోట్లను కూడా దశలవారీగా సమకూర్చి కళాశాలను తెలంగాణలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం కళాశాలలో సుమారు 3 వేల 5వందల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని బ్యాంకింగ్ సర్వీసెస్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, సివిల్ సర్వీసెస్ తదితర ఉద్యోగ, పోటీ పరీక్షలకు ఉపయోగపడే కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

అదేవిధంగా బాలికల కోసం హాస్టల్ నిర్మాణం, కళాశాల గ్రౌండ్ అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాలలో 15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో ప్రీ–ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యా సదుపాయాలను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. చిన్నారుల నుంచి డిగ్రీ, పీజీ విద్యార్థుల వరకు వేలాది మందికి నాణ్యమైన విద్య అందించేలా మొత్తం ఎంవీఎస్ ప్రాంగణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని, రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో అత్యాధునిక మౌలిక వసతులతో అద్భుతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మీడియా కన్వీనర్ సిజె బెనహర్, కార్పొరేటర్లు గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, రమేష్ బాబు, కిషన్ నాయక్, రమేష్ రెడ్డి, ఫక్రు , ఎస్ శేఖర్, మేగ్యా నాయక్, తాహేర్, విట్టల్ రెడ్డి, అనుప ఆంజనేయులు, భాను చందర్ , సోషల్ మీడియా ఇంచార్జీ ఏర్పుల నాగరాజు, నాయకులు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, చంద్రమౌళి, అబ్దుల్ హక్, నరేష్, మోయీజ్ , కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి ఇఇ కె.రాంచంద్రం, డిఇఇ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# నినాదాల హోరు
# వివాదాల జోరు

**ఉద్రిక్తతల నడుమ రెండు పార్టీల మీటింగులు**

**విజయోత్సవాల పేరుతో ఒకరు, దగా పాలన పేరుతో మరొకరు హోరా హోరీ ర్యాలీలు**

**ఇరుపార్టీలను కట్టడి చేయడం లో పోలీసులకు తప్పని తిప్పలు**

**అధికార పార్టీ ర్యాలీ ఆలస్యం కావడం తో బీఆర్ఎస్ పార్టీ ర్యాలీ ని కొద్దిసేపు ఆపిన పోలీసులు**

**రెండు గంటలు ఓపిక పట్టి పోలీసులను నెట్టుకుని ర్యాలీని ప్రారంభించిన భారసా నాయకులు**

**పోలీసులకు బీఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట**

**ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిన వాతావరణం**

**భారీగా పోలీసుల మోహరింపు**

**బీఆర్ఎస్,కాంగ్రెస్ పోటా పోటీ నినాదాలతో దద్దరిల్లిన అంబేద్కర్ సెంటర్**



అక్షిత ప్రతినిధి భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శనివారం బీఆర్ఎస్,కాంగ్రెస్ నాయకులు చేపట్టిన కార్యక్రమాలు ఒక్కు సారిగా పొలిటికల్ హీట్ ను పెంచాయి.. తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటు కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాలను,అటు బీఆర్ఎస్ పార్టీ వెయ్యి రోజుల దగా పాలన పేరుతో కార్యక్రమాలను నిర్వహించింది..ఈ రెండు ర్యాలీలు దాదాపు ఒక గంట తేడాతో ఉండటం తో వివాదం చెలరేగింది..ముందుగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డీసీసీ అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ నేతృత్వంలో హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు.వెయ్యి రోజుల ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉదయం 10 గంటల నుంచి అనుమతి తీసుకుంది. అదే సమయంలో కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ 'వెయ్యి రోజుల దగా పాలన' పేరుతో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన చేపట్టేందుకు బీఆర్ఎస్ ఉదయం 11 గంటలకు అనుమతి తీసుకుంది. అయితే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్ణీత సమయానికి ప్రారంభం కాకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది..దాదాపు అనుకున్న సమయం కన్నా ఒక రెండుగంటలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో, బీఆర్ఎస్ నాయకుల కార్యక్రమం ను పోలీసులు కొద్దిసేపు వాయిదా వేసుకోవాల్సిందిగా కోరారు..దాదాపు 2గంటలు ఊర్వశి థియేటర్ లో వేచి చూసిన బీఆర్ఎస్ కార్యకర్తలు సహనం కోల్పోయి పోలీసులతో వాగ్వాదానికి దిగారు..ఓ పక్క అంబేద్కర్ సెంటర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నడుస్తుండటం తో మరి కొద్ది సమయం తర్వాత తమ కార్యక్రమాలు చేసుకోవాలని పోలీసులు బీఆర్ఎస్ నాయకులు కోరారు..

**ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారిన వాతావరణం**

ఒకే సమయం లో ఇరు పార్టీల ప్రోగ్రామ్ లు ఉండటం తో అంబేద్కర్ సెంటర్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు..బీఆర్ఎస్ నాయకులను చాలా సేపు ఊర్వశి థియేటర్ లోనే ఉంచారు..సమయం గడుస్తున్న తమను బయటకు అనుమతించక పోవడం తో బీఆర్ఎస్ నాయకులు పోలీసుల తీరు పై అసంతృప్తి వ్యక్తం చేశారు..ఆ సమయం లోనే గండ్ర వెంకటరమణ రెడ్డి థియేటర్ ప్రాంగణానికి చేరడం తో జై బిఆర్ఎస్ అంటూ నినాదాలు హోరెత్తాయి.. మధ్యాహ్నం ఒకటి కావస్తున్నా తమ ర్యాలీకి ఇంకా పోలీసులు అనుమతించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గండ్ర వెంకటరమణ రెడ్డి తన అనుచరులతో కలిసి ముందుకు కదిలారు..దీంతో బి ఆర్ ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు.. పోలీసులను నెట్టుకుంటూ బిఆర్ఎస్ నాయకులు ముందుకెళ్లే ప్రయత్నం చేశారు.. ఇద్దరు మధ్య తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.. జై బీఆర్ఎస్ నినాదాలతో భారాస నాయకులు రోడ్డుపై కదిలారు.. అప్పటికే అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకుల ప్రసంగం ఇంకా నడుస్తూనే ఉంది.. దీంతో భారీగా పోలీసులను మోహరించి పరిస్థితులను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.. ఒక్కసారిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీ నినాదాలతో అంబేద్కర్ సెంటర్ ను ఉద్రిక్తంగా మార్చారు.. ఈ నేపథ్యంలో కొద్దిసేపు అంబేద్కర్ సెంటర్ పరిసరాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యక్రమాలకు ఒకే ప్రాంతంలో, దాదాపు ఒకే సమయంలో అనుమతులు ఇవ్వడం, ఒక పార్టీ కార్యక్రమం ఆలస్యం కావడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చిందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాలు వ్యక్తమయ్యాయి.

## ప్రపంచ జానపద జాతర దినోత్సవ సంబరాలు

**నర్సాపూర్‌లో ఘనంగా జానపద కళల ప్రదర్శన.. కళలను కాపాడుకోవాలి: ఆంజనేయులు గౌడ్**



కౌడిపల్లి/ అక్షిత న్యూస్: ప్రపంచ జానపద జాతర దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జానపద జాతర సంబరాలను ఘనంగా నిర్వహించారు.నర్సాపూర్ చిల్డ్రన్ పార్క్ నుంచి ప్రారంభమైన జానపద కళాకారుల ఊరేగింపు బస్టాండ్ మీదుగా చౌరస్తా వరకు కొనసాగింది. డప్పు చప్పుళ్ళు, సింధు కళాకారుల నృత్యాలు, ఆడపడుచుల బతుకమ్మ ఆటలు, ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు, బోనాలు, డోలు--సన్నాయి వాయిద్యాలతో నిర్వహించిన ఊరేగింపు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఊరేగింపు సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌కు చేరుకోగా అక్కడ జానపద జాతర సంబరాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువాసిని రెడ్డి, బీజేపీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీధర్ యాదవ్, దరువు అంజన్న తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలో ఆధునికత పెరుగుతున్న నేపథ్యంలో ఒకప్పుడు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన అనేక జానపద నృత్య కళలు, కళారూపాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సింధు ఆటలు, డప్పు చప్పుళ్ళు, డోలు--సన్నాయి వంటి జానపద కళలు ప్రజల్లో చైతన్యం నింపడంలో కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు.ప్రస్తుతం అనేక జానపద కళలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, వాటికి పునర్జీవం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జానపద కళాకారులు తమ వృత్త

## జలసిరి పనులపై డీఆర్‌డీవో ప్రత్యేక సమావేశం



రామన్నపేట, అక్షిత ప్రతినిధి: రామన్నపేట మండలంలో జలసిరి పనులపై గౌరవ డీఆర్‌డీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జలసిరి పనుల్లో లేబర్ రిపోర్ట్ అధికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఫారం పాండ్ (ఖీuఈఎ ాశీఅఢ) పనులను ఎక్కువ సంఖ్యలో చేపట్టాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో 40--60 శాతం వరకు లేబర్ రిపోర్ట్ ఉండే విధంగా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి కూలీలకు ఎక్కువగా పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాములు, ఎంపీవో రఫీ, ఏపీవో వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రవీణ్, హరికృష్ణ, మధు, సుచరిత, కంప్యూటర్ ఆపరేటర్లు యాదగిరి, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## నీరు లేక వెల వెలబోతున్న బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం!!!

**నాగార్జునసాగర్ లో నీరున్న ఉదయ సముద్ర ప్రాజెక్టు నింపని వైనం!!**

**చెరువులను నింపి సాగునీరు అందించాలని రైతుల డిమాండ్**

**వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన**

**12 గంటల విద్యుత్ సరఫరాలోను అంతరాయం**

**బోర్ బావుల కింద సాగవుతున్న పొలాలు వైనం ఎండిపోతున్నాయి!!!**





నార్కట్‌పల్లి, అక్షిత న్యూస్: ఒకప్పుడు నీటితో కలకలాడుతూ చుట్టుపక్కల ప్రాంతాలకు జీవనాధారంగా నిలిచిన బ్రాహ్మణ వెల్లంల ఉదయం సముద్రం ఇప్పుడు వెలవెలబోతుంది. జలాశంలో నీరు తగ్గిపోవడంతో అడుగుభాగం బయటపడండి నిండుకుండలా కనిపించాల్సిన రిజర్వాయర్ నేడు ఎండిపోయిన నేలలు, రాళ్లతో దర్శనమివ్వడం ఆందోళన కలిగిస్తుంది.

మరోవైపు ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంపై రైతులెన్నో ఏళ్లుగా ఆశలు పెట్టుకున్నారు ఈ పథకం ద్వారా నల్గొండ, నకిరికల్లు, మునుగోడు ప్రాంతాల్లోని సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రదర్శన రూపొందించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఉదయ సముద్రం రిజర్వాయర్ నీటిమట్టం తగ్గిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. రిజర్వాయర్ పరిధిలో నీరు తగ్గి విస్తారమైన ప్రాంతం ఎండిపోయి బీటలు వారినట్లు కనిపిస్తోంది. అక్కడక్కడా మాత్రమే కొద్దిపాటి నీరు నిలిచి ఉండటంతో రిజర్వాయర్ దుస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.

**విద్యుత్ సరఫరాలో కోతలు**

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలు విశిష్టతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ముఖ్యంగా వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరాల అంతరయం ఏర్పడటంతో పంటలకు సాగునీరు వందకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు అవసరమైన సమయంలో నీరు పెట్టలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే వరి పంట ఎండిపోతున్న దశలో ఉన్నదని కన్నీరు మున్నీరు అవుతున్నారు. అధికారులు స్పందించి వ్యవసాయానికి నిరంతరాయంగా 12 గంటల విద్యుత్ సరఫరా చేయడంతో పాటు కోత లేకుండా సరఫరాను పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు.

# మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే

### ఉపాధ్యాయులు లేకపోతే జ్ఞానం అనే వెలుగు మన జీవితాల్లో చేరేది కాదు

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

### షాద్ నగర్‌లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే అని వారు మనకు చదువుతో పాటు మంచి విలువలు కూడా నేర్పిస్తారని ఉపాధ్యాయులు లేకపోతే జ్ఞానం అనే వెలుగు మన జీవితాల్లో చేరేది కాదని వారు చూపే మార్గమే మన విజయానికి పునాది అవుతుందని నిజమైన చరిత్ర సృష్టికర్త ఉపాధ్యాయుడే అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పాటు నియోజకవర్గంలోని గురువులను సన్మానించి పాదాభివందనం చేసి ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవాని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఆదర్శప్రాయుడైన విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 5 న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులు ముఖ్య పాత్ర పోషిస్తారని గురువులు జీవితంలో మంచి చెడులు చెప్పి జీవిత పాఠాల నేర్పిస్తారని అందుకే పెద్దలు మాతృదేవోభవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ అని గొప్పగా పోగొడారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** ప్రానిక ప్రభుత్వ ఎనిఆర్ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)లో అధ్యాపకులు, విద్యార్థి నిలంతా కలిసి ఉఫాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల అలంకరించి, పూజానంతరం అధ్యాపకులు విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగాలతో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్. డి. ప్రకాశ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం. భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణం.

ఉపాధ్యాయుడు కేవలం పాఠ్యపుస్తకంలోని విషయాలను మాత్రమే బోధించేవాడు కాదు. ఎలా చదవాలి? ఎలా ఆలోచించాలి? ఎలా ప్రవర్తించాలి? జీవితంలో ఎలా ముందుకు సాగాలి? అనే విషయాలను కూడా నేర్పిస్తాడు. ఒక విద్యార్థి జీవితంలో గురువు పాత్ర ఎంతో గొప్పది. విద్యార్థి తన జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా, ఆ విజయానికి వెనుక ఎక్కడో ఒకచోట ఒక గురువు యొక్క కృషి తప్పకుండా ఉంటుంది. మన జీవితంలో ఎన్నో విషయాలను మనం మరిచిపోవచ్చు. కానీ మనకు మొదటిసారి అక్షరాలు నేర్పిన గురువును, మనలో ధైర్యాన్ని నింపిన గురువును, మన తప్పులను సరిదిద్దిన గురువును మాత్రం జీవితాంతం గుర్తుంచుకోవాలి. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక మంచి విద్యార్థిని మాత్రమే తయారు చేయడు; ఒక మంచి కుటుంబాన్ని, ఒక మంచి సమాజాన్ని, చివరికి ఒక మంచి దేశాన్ని తయారు చేస్తాడు అంటూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పండ్ల వ్యాపారులకు అవగాహన సదస్సు

### పరిశుభ్రత, నాణ్యత తప్పనిసరి



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో పండ్ల వ్యాపారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పండ్ల వ్యాపారి పండ్ల విక్రయ సమయంలో సిగరెట్ తాగుతూ, గుట్కా తింటూ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వినియోగదారుల ఆరోగ్య దృష్ట్యా అవగాహన కల్పించారు.

పండ్ల నాణ్యత ఎలా ఉండాలి, కృత్రిమంగా మాగబెట్టిన పండ్లను ఎలా గుర్తించాలి, పండ్లను శుభ్రంగా, దుమ్ము ధూళి లేకుండా ఎలా నిల్వ చేయాలి అనే అంశాలపై వ్యాపారికి సూచనలు చేశారు. వ్యాపారులు చేతులకు గ్లౌజులు ధరించాలని, ధూమపానం, గుట్కా వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కన్జ్యూమర్ కమిషన్ చైర్మన్ బి. బాలరాజు , ఉమ్మడి మహబూబ్ నగర్ అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్ టౌన్ ప్రెసిడెంట్ సుందర్ రాజ్ పాల్గొని పండ్ల నాణ్యత ప్రమాణాలపై అవగాహన కల్పించారు. వినియోగదారులు కూడా పండ్లు కొనేటప్పుడు తాజాదనం, రంగు, వాసన పరిశీలించి కొనుగోలు చేయాలని కోరారు.

## కోనేరు ఎన్జీవో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

### ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం

### ప్రధానోపాధ్యాయులు రాంజీ నాయక్



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కోనేరు ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంజీ నాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం రోజు ఉపాధ్యాయులను గౌరవించడం స్వచ్ఛంద సంస్థ గుర్తించి సన్మానం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రాముఖ్యత బాల కార్మికులు , బాల్య వివాహాలు, అక్రమ రవాణా, పిల్లలపై లైంగిక వేధింపులు, తదితర విషయాలపై గత 25 సంవత్సరాల నుండి పనిచేస్తుందని కొనియాడారు. పాఠశాలలో డ్రాపోర్టు పిల్లలకు ఇంట్లో దగ్గరికి వెళ్లి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని స్కూల్ కి వచ్చే విధంగా చేస్తున్నారు. అదేవిధంగా ముందుగానే బాల్య వివాహం చేసుకోరాదని గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తూ. గ్రామపంచాయతీలలో బాలల సౌరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి అన్ని శాఖలతో చర్చించడం జరుగుతుంది. గ్రామంలో ఎక్కడ కూడా బాల్య వివాహ రహిత గ్రామంగా ఇదే విధంగా గ్రామస్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇదేగాక గ్రామాలలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. పిల్లలు ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్ళకుండా వారిని స్థానికంగా ఉన్న పాఠశాలలో లేదా హాస్టల్లో వసతి కల్పించి విద్యలు అందించే దిశగా కృషి చేస్తున్నారు. ఎంతోమంది గ్రామీణ ప్రాంతాలలో వెనుకబడిన పిల్లలకు రక్షణగా ఉంటూ వారికి పై చదువుల కోసం వివిధ వసతి గృహాలలో చేర్పించి విద్య లో ముందుకు వెళ్లే విధంగా కృషి చేస్తున్నారు. సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఎంతో ప్రజలకు ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉపాధ్యాయులను గౌరవించడం కోసం కోనేరు సంస్థ ఉపాధ్యాయులందరికీ శాలువాలతో సత్కరించడం చాలా సంతోషమని ప్రధానోపాధ్యాయులు రామ్ జి నాయక్ తెలిపారు. ఒక్కొక్క ఉపాధ్యాయులకు బోకే ఇస్తూ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోనేరు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు. ఏరియా కోఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కాజా సలాం, ఉపాధ్యాయ బృందం ఆనంద్ ప్రసాద్, ప్రణీత ,స్వర్ణలత సత్యనారాయణ శీను ఆనంద్ బాబు లక్ష్మణ్ వేణుగోపాల్ రవిశంకర్ సంధ్యారాణి విజయ గోపాల్ రెడ్డి అజిత్ బేగం లిఖిత్ బేగం ఆఫ్రి బేగం శివ కుమార్, శిరీష పి ఈ టి, నాగేంద్రం, రజిత వంశీ జ్యోతి గాన్సిరాం రాథో, కాజా సలీం, తదితరులు పాల్గొన్నారు.

## మామిళ్లగూడెం అర్బన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగర పరిధిలోని మామిళ్లగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా ఆసుపత్రిలోని ల్యాబొరేటరీ వ్యాక్సినేషన్ గది మరియు మెడిసిన్ స్టోర్ రూమ్‌లను స్వయంగా పరిశీలించారు. ల్యాబ్‌లో రోగులకు అందుతున్న డయాగ్నస్టిక్ సేవల వివరాలను స్టోర్‌లో అందుబాటులో ఉన్న మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు.ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్యం పరిశుభ్రత నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం పీహెచ్‌సీ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: ఎన్ సి డి.స్క్రీనింగ్ పోర్టల్ అప్‌డేట్ నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ స్క్రీనింగ్ నూరు శాతం పూర్తి చేయాలని చికిత్స పొందుతున్న రోగుల వివరాలను ఎప్పటికప్పుడు ఫాలో-అప్ చేస్తూ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు.మీ ప్రణాం యాప్ సిబ్బంది అంతా విధిగా మీ ప్రణాం అటెండెన్స్ యాప్‌లో ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేసుకుని సమయపాలన పాటించాలని ఆదేశించారు.

హెచ్ ఎం ఐ ఎస్ డేటా నమోదుఎప్రతి నెలా 5వ తేదీ లోపు హెచ్‌ఎంఐఎస్ డేటా ఎంట్రీని ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. గర్భిణులు బాలింతలు, చిన్నారులకు సకాలంలో టీకాలు అందించడంతో పాటు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే సామాన్య రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్ కృష్ణ చైతన్య ఫార్మసిస్ట్ ల్యాబ్ టెక్నీషియన్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.